క్లుప్తంగా

యోగా క్రీడాకారుడికి సన్మానం



మహబూబ్‌నగర్ క్రీడలు: ఇటీవలే సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా టోర్నమెంట్‌లో 35–45 ఏళ్ల విభాగంలో కాంస్య పతకం సాధించిన కె.వెంకటేశ్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, దసరా ఉత్సవ కమిటీ ప్రతినిధులు డాక్టర్ మురళీధర్, కేఎస్.రవికుమార్, అంజయ్య, చంద్రకుమార్‌గౌడ్, బురుజు సుధాకర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

లోకిరేవులో మెగా వైద్యశిబిరం



నవాబుపేట: మండల పరిధిలోని లోకిరేవు గ్రామంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. హైదారాబాద్‌కు చెందిన సాయిసేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 390 మందికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. శిబిరంలో డాక్టర్లు నారాయణ, కిషోర్, దివ్య, ప్రకాష్‌ల బృందం పరీక్షలు నిర్వహించింది. మాజీ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, కృష్ణగౌడ్, సత్యం, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా రమేశ్

జడ్చర్ల: స్థానిక సాయినగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం సకల దేవతల ఆలయంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా పాలాది రమేశ్, గౌరవ అధ్యక్షుడిగా కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌రెడ్డి, నరేష్, కోశాధికారులుగా సతీష్‌కుమార్, చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా యాదిరెడ్డి, హర్యానాయక్, అశోక్, కార్యదర్శిగా కుర్మయ్య, సహాయ కార్యదర్శిగా తారాసింగ్ తదితరులు ఎన్నికయ్యారు. అదేవిధంగా సలహాదారులుగా శంకర్, భాస్కర్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణమూర్తి తదితరులను ఎన్నుకున్నారు.

ప్రతి విద్యార్థికి వసతి కల్పించాలి

జడ్చర్ల: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీపీజీఈటీ పరీక్షల్లో ర్యాంకు సాధించి మొదటి కౌన్సిలింగ్ పూర్తి చేసుకుని.. పీయూలో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఏబీవీపీ పాలమూరు యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఒక ప్రకటనలో తమ డిమాండ్లను పేర్కొన్నారు. నూతన భవనాన్ని ప్రారంభించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని లేని ఎడల ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

రాజాపూర్: మండల కేంద్రానికి చెందిన సయ్యద్ ఈనెల 9న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ క్రమంలో బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు అతడి స్నేహితులు ముందుకు వచ్చారు. అతడి భార్యా, పిల్లలకు రూ. 27వేల నగదును ఆదివారం అందజేశారు. బాల్‌రాజ్, నరేష్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, సాయిరాం, నర్సింలు, రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ ప్రారంభం

మహమ్మదాబాద్: ఉపాది హామీకి సంబంధించి సోషల్ ఆడిట్ మండలంలో ఆదివారం ప్రారంభమైంది. మొదటి విడతగా 22 గ్రామాల్లో కార్యక్రమం చేపట్టారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు సంబంధించి కూలీలకు పని కల్పించిన పని దినాలకు తదితరాలపై ఆడిట్ కొనసాగించనున్నారు. ఈమేరకు గ్రామాల్లో అధికారులు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



మిడ్జిల్: మండల పరిధిలోని కొత్తపల్లి శివారు దుందుభీ వాగు నుంచి ఆదివారం ఉదయం అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడకు చేరుకుని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

రాజాపూర్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రాజాపూర్ ఎస్‌ఐ రవి తెలిపారు. పెట్రోలింగ్‌లో భాగంగా ఈద్గాన్‌పల్లి నుంచి యారన్‌పల్లి వైపు తమ సిబ్బంది వెళ్తుండగా ట్రాక్టర్ పట్టుబడినట్లు వివరించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు.

నీరుగారుతున్న లక్ష్యం

- ఇప్పటికీ నర్సరీల్లోనే మొక్కలు
- నాటిన వాటికి సంరక్షణ కరువు



కుచ్చర్‌కల్ నర్సరీలో మొక్కలు

రాజాపూర్: అడవులను కాపాడాలని.. పర్యావరణాన్ని రక్షించాలన్న ప్రభుత్వ లక్ష్యం కొందరి నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది. వాతావరణ సమతుల్యం సాధించాలని గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి.. పెంచి పోషించాలని ఆదేశించినా క్షేత్రస్థాయిలో అమలు మాత్రం కనిపించడం లేదు. ఫలితంగా ఇప్పటికీ నర్సరీల్లోనే మొక్కలు ఉండిపోతున్నాయి. ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యం ఏమాత్రం నెరవేరేలా కనిపించడం లేదు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లోని 24 నర్సరీలను ఏర్పాటు చేశారు. వాటిలో మొక్కలు పెంచారు. ఈ మేరకు మండలంలో ఈ సంవత్సరం లక్షా డెబ్బై వేల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్దేశించారు. కానీ అందులో లక్ష వరకు మాత్రమే మొక్కలు నాటినట్లు రికార్డులు చెబుతున్నాయి. ముఖ్యంగా అవెన్యూ ప్లాంటేషన్‌కు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలని అధికారులు ఆదేశాలు ఇచ్చినా.. మొక్కలు నాటేందుకు ఖాళీ స్థలాలు లేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు గ్రామాల్లో ఈజీఎస్ సిబ్బంది చేత మొక్కలు నాటిస్తున్నారు కానీ సంరక్షణ విషయంలో ఎలాంటి పర్యవేక్షణ లేదు. దీంతో నాటిన మొక్కల్లో కొన్ని ఎండిపోతున్నాయి. మరికొన్నింటికి ట్రీగార్డులు వంటివి లేకపోవడంతో పశువులు, మేకలు, గొర్రెలకు మేతగా మారుతున్నాయి. ఇంకొన్నింటిని రోడ్లవెంట నాటగా.. కొంత పెద్దవిగా కాగానే విద్యుత్ లైన్లు పైన ఉండటంతో సిబ్బంది వాటిని నరికి వేస్తున్నారు. ఇలా పలువురి నిర్లక్ష్యం మొక్కల పెంపకానికి ప్రతిబంధకంగా మారుతోంది. దీంతో ఇప్పటికైనా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

మనం నాటిన మొక్కలను చిన్నపిల్లల మాదిరిగా సంరక్షిస్తేనే.. రేపటికి చెట్లుగా మారుతాయి. వాటికి సంరక్షణ చేపట్టడం లేదు. నాటి తరువాత తమ బాధ్యత అయిపోయిందన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో కొన్ని ఎండిపోయి, మరికొన్ని పశువులు, మేకలకు ఆహారంగా మారుతున్నాయి. ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకొని మొక్కలను సంరక్షించాలి.

– శేఖర్‌గౌడ్ ముదిరెడ్డిపల్లి

లక్ష్యం కంటే ఎక్కువగానే..

నర్సరీల్లో లక్ష్యం కంటే ఎక్కువగా మొక్కలు పెంచారు. ప్రస్తుతం ఈత మొక్కలు సైతం అందుబాటులో ఉన్నాయి. ఎవరికైనా పెంచుకునేందుకు ఆసక్తి ఉంటే మొక్కలు అందజేస్తాం. అంతేకాకుండా కరెంట్ లైన్స్ కింద కానుగ, గన్నేరు మొక్కలను మాత్రమే పెంచాలని ఆదేశాలు ఉన్నాయి. దీంతో ఈ సారి వాటిని మాత్రమే నాటించాం.

– మచ్చేందర్, ఎంపీడీఓ, రాజాపూర్

అవోపా ఆధ్వర్యంలో గురుపూజోత్సవం



ఉపాధ్యాయులతో డీఈఓ రవీందర్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా అవోపా అధ్యక్షుడు కంది శ్రీనివాస్ అధ్యక్షతన స్థానిక బ్రాహ్మణవాడీలో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మంది ఆర్యవైశ్య ఉపాధ్యాయులను మెమోంటోలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాధికారి రవీందర్ మాట్లాడుతూ ఇలాంటి సన్మానాలు ఉపాధ్యాయుల్లో ప్రోత్సాహాన్ని ఇస్తాయని అన్నారు. ఇంతమంది ఉపాధ్యాయులను సన్మానించడం అభినందనీయమని అన్నారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, కండె కుమారస్వామి, సూర్యనారాయణ, గుండ వెంకటేశ్, చక్రధర్‌గుప్త పాల్గొన్నారు.

మట్టి వినాయకుడికి పూజలు



మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ గిరిజన భవన్‌లో మట్టి వినాయకుడికి ఆదివారం జిల్లా కమిటి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డి.లక్ష్మణ్‌నాయక్, రాజునాయక్, భూక్య యాదగిరి నాయక్, జె.బాలుమహేంద్ర, ఆర్.లక్ష్మణ్‌నాయక్, సుభాష్‌రాథోడ్, రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్యూబ్‌పై వెళ్లి బాగు చేశారు..!



చెరువు మధ్యలో ఉన్న బోరు మోటారును బాగు చేస్తున్న కార్మికులు

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన బోరు మోటారు చెరువులో ఉండటంతో దాన్ని పంచాయతీ సిబ్బంది అతికష్టం మీద బాగు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి సమీపంలో ఉన్న ఊర చెరువులో పంచాయతీ బోరు మోటారు ఉంది. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండింది. దీంతో బోరు వద్దకు వెళ్లడానికి వీలు లేకుండా మారింది. ఈ క్రమంలో ఆదివారం గ్రామ పంచాయతీ కార్మికుడు పెద్ద కుర్మయ్య లారీ ట్యూబ్‌ను బోటులా మార్చుకుని హరిజన్ రాములుతో కలిసి నీటి మధ్యలోకి వెళ్లాడు. ప్రమాదకరమైనప్పటికీ బోరు మోటారు వద్దకు వెళ్లి దానికి మరమ్మతు చేశాడు. గమనించిన గ్రామస్తులు కుర్మయ్యను అభినందించారు.

ఉపాధ్యాయురాలికి పురస్కారం



మహమ్మదాబాద్: నంచర్ల గురుకుల పాఠశాల మ్యూజికల్ టీచర్ శ్యామల ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ప్రజాకవి కాళోజీ, సర్వేపల్లి రాధాకృష్ణ, పాకాల యశోదారెడ్డిల జయంతి మాసం పురస్కరించుకుని.. తెలంగాణ మహిళా సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ఓయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకటరెడ్డి, ప్రముఖ రచయిత డాక్టర్ రామారావు, సూర్యప్రకాష్‌రావు, వీణారెడ్డి, పీయూ ప్రొఫెసర్ శ్రీనాథ్‌ల చేతుల మీదుగా పురస్కారం అందజేశారు.

కుక్రి పామును తిన్న కట్లపాము




జడ్చర్ల: పాములు తన కంటే చిన్న సర్పాలను తినడం సహజమని.. సర్పరక్షకుడు వృక్షశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య తెలిపారు. ముఖ్యంగా కట్లపాము ఇతర చిన్న పాములనే ఆహారంగా తీసుకుంటుందని అవి దొరకని పక్షంలో ఎలుకలు, తదితర జీవులను తింటాయన్నారు. ఇలాంటి ఘటనే ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో జడ్చర్లలోని ఒక ఎరువుల గోదాంలో చోటు చేసుకున్నట్లు వివరించారు. గోదాంలో రెండు పాములు ఉన్నాయని తమకు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి పరిశీలించినట్లు పేర్కొన్నారు. కాగా కట్ల పాము కుక్రి పామును తింటుండడాన్ని గమనించినట్లు తెలిపారు. రెండు పాములను తాము పట్టుకుని అడవి ప్రాంతంలో వదలేస్తామని వివరించారు.

సామాజిక సేవలో ముందుండాలి


మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వీరశైవ లింగాయత్ మహబూబ్‌నగర్ రూరల్ మండల అధ్యక్షుడిగా ఆకుల బస్వరాజ్, మహిళా అధ్యక్షురాలిగా ఎస్.శైలజ, యువజన కమిటీ అధ్యక్షుడిగా శెట్టి హరీష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మణికొండలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొండ వీరన్న, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి మూల సిద్దిలింగం, మహిళా అధ్యక్షురాలు నాగశ్రీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో ముందుండాలన్నారు. ఇతరులకు సాయ పడుతూ వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం కొత్త కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు సతీష్, అర్చకుడు వీరేష్ సిద్ధు పాల్గొన్నారు.

గొర్రెల కాపరులను ఆదుకోవాలి


నారాయణపేట: ఇటీవల కర్ణాటకలోని రాయచూర్ మాన్వి బైపాస్ రోడ్డులో బస్సుఢీకొని గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వాటికి సంబంధించిన గొర్రెల కాపారులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణకు చెందిన నారాయణపేట జిల్లా గొర్రెల కాపారులు, రైతులు గొర్రెలను మేపు కోసం తెలంగాణతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం కొనసాగిస్తారని పేర్కొన్నారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లో మాన్వి బైపాస్ రోడ్డు దగ్గర రైల్వే బ్రిడ్జిపై కర్ణాటకకు చెందిన ప్రైవేట్ బస్సు (విజయనంద్ ట్రావెల్స్) ఢీకొని 155 గొర్రెలు మృత్యువాత పడినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలం ఓబులాపురానికి చెందిన పూజారి సీనప్ప, లక్ష్మీపురం అనంతమ్మ, గంట మల్లేష్‌లను ఆదుకోవాలని బస్సు ట్రావెల్ యజమానులను సంప్రదించినట్లు తెలిపారు. ట్రావెల్ యజమాని మానవత్వం మరిచి ఇన్సూరెన్స్ క్లైమ్ చేసుకోమనడం దారుణమని తెలిపారు. ట్రావెల్స్ యజమాని నష్టపోయిన రైతులకు తక్షణ సాయంగా ఐదు లక్షల చొప్పున ఇప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఆదుకోవాలని కోరారు.



రుక్కంపల్లిలో ఇళ్ల మధ్య మురుగు, పిచ్చిమొక్కలు



కిషన్‌గూడలో..



నవాబుపేట గిరిజన తండాలో..

పారిశుద్ధ్య చర్యలు చేపట్టరా?

నవాబుపేట: మండలపరిధిలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంలో సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆయా చోట్ల మురుగు కుంటలు దర్శనమిస్తున్నాయి. దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. రుక్కంపల్లి, కిషన్‌గూడ, ఇప్పటూర్, హజిలాపూర్ తదితర గ్రామాల్లో సమస్య తీవ్రంగా ఉంది. దీంతో వ్యాధులు బారిన పడే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకుని పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎస్టీలలో ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలి



నిరసన తెలుపుతున్న టీపీవైఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎస్టీలలో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం (టీపీవైఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాల్‌కోట శ్రీనివాసులు కోరారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో కొద్దిసేపు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎరుకలు ఉద్యోగ, ఉపాధితో పాటు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి పోయారన్నారు. ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటుతో పాటు రూ.వేయి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో నిర్మించిన ఏకలవ్య భవనాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.కృష్ణ, బి.రమేష్, బి.లక్ష్మమ్మ, జానకమ్మ, ఎల్లమ్మ, వెంకటయ్య, బీషయ్య, చెన్నయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో యువత సభ్యులుగా చేరాలి

పాలమూరు: బీజేపీని అభిమానించే ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకోవాలని, జిల్లాలో పార్టీ క్యాడర్ పెరగడానికి సభ్యత్వ నమోదు ప్రక్రియ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 14, 30వార్డులో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయనతో పాటు బీజేపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి రాములు హాజరై పార్టీ సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ పట్ల, ధర్మం పట్ల నిబద్ధతతో పని చేసే బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. పార్టీలో యువత సభ్యులుగా చేరాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ ముఖ్య నాయకులు, బీజేపీ కార్యకర్తలు ఒక యజ్ఞం మాదిరిగా పూర్తి చేయాలన్నారు. బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంఛార్జీలు, వార్డు ఇంఛార్జీలు వారికి ఇచ్చిన సంఖ్యను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంజయ్య, చెన్న వీరయ్య, అంజయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

మక్తల్: పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. బీజేపీ రాష్ట్ర పిలుపు మేరకు మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో 6వ వార్డులో, మాదన్‌పల్లి, గుడిగండ్ల, రామసముద్రం గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ కన్వీనర్ కర్నిస్వామి, అర్బన్ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి ప్రసన్నరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగప్ప, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో ఆలయ నిర్మాణం



కపిలేశ్వర స్వామి



ఆలయ నిర్మాణ పనులు చేస్తున్న శిల్పులు

భూత్పూర్: మండలంలోని పాత కప్పెటలో గత వారం రోజుల నుంచి దాతల సహకారంతో శ్రీ కపిలేశ్వర స్వామి (శివాలయం) ఆలయం మండపం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక్కడి స్వయంభూ శివలింగం కాకతీయుల కాలం నుంచి పూజలు అందుకొన్నట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా 15ఏళ్ల క్రితం కప్పెటకి చెందిన మన్యపురెడ్డి గ్రామస్తుల సహకారంతో గర్భగుడిని నిర్మించినట్లు గ్రామపెద్దలు జంగిరెడ్డి, దేవాలయ కమిటీ అధ్యక్షుడు టి. వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాగా గ్రామస్తులు ప్రస్తుతం నిర్మాణం కోసం దాదాపు రూ.30 లక్షలు సహకారం అందించినట్లు వివరించారు. మన్యపురెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు లక్ష్మీకాంత్‌రెడ్డి రూ.2.50లక్షలు అదేవిధంగా.. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రూ.2లక్షలు, రూ.1.5లక్షల చొప్పున టి.వెంకటేశ్వర్‌రెడ్డి, రాజుగౌడ్ విరాళం అందజేసినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు గ్రామానికి చెందిన ప్రతి కుటుంబ నుంచి రూ. 25వేల నుంచి రూ.2.50 లక్షల వరకు విరాళాలు అందినట్లు వివరించారు.

గురువులు మార్గదర్శకులు



జడ్చర్ల: మనిషి జీవితంలో గురువు ప్రధాన పాత్ర పోషిస్తారని.. మంచి నడవడిక అలవర్చుకోవడంలో మార్గదర్శకులుగా ఉంటారని సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానికంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆచార్య దేవోభవ కార్యక్రమం నిర్వహించారు. ఏటా సర్వేపల్లి జయంతిని పురస్కరించుకుని కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. క్లబ్ రీజియన్ చైర్మన్ శ్రీను, అధ్యక్షుడు కైలాష్, డాక్టర్ వి.రాంరెడ్డి, మహేంద్రకుమార్‌రెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద శ్రమదానం



అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారుల నిర్వాహణ సంస్థ ఆదేశాలతో ఆదివారం సిబ్బంది శ్రమదానం చేశారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా టోల్‌ప్లాజా పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ దీపా మాడియా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ మేనేజర్ సంతోష్ కుమార్, రూట్ ఆఫీసర్ తేజ స్వరూప్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సురేందర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కారుకొండ పాఠశాలలో తమ గురువులతో పూర్వవిద్యార్థులు

నవాబుపేట: మండల పరిధిలోని కారుకొండ జెడ్పీ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 20 సంవత్సరాల అనంతరం అదే పాఠశాల వద్ద కలుసుకుని ఆనందంగా గడిపారు. నాటి తమ గురువులతో పాటు తాజాగా ఉన్న ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి సాయం అందించేందుకు నిర్ణయం తీసుకున్నారు. హెచ్ఎం దశరథ్‌నాయక్, రాజు, జగదీష్, సుధాకర్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర రూరల్: కాకతీయ పాఠశాల (2005–06 పదోతరగతికి బ్యాచ్) పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం ఆదివారం బస్వాయపల్లి సమీపంలో ఘనంగా నిర్వహించారు. సుమారు 70 మంది విద్యార్థులు 18 సంవత్సరాల తరువాత కలుసుకొన్నారు. చిన్ననాటి రోజులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. నాటి తమ గురువులకు పాదపూజ చేసి సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనలు చేశారు.

మైసమ్మ చెంత జనజాతర



నవాబుపేట: మండలపరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ చెంత జనజాతర కొనసాగింది. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున్న భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. పచ్చని చెట్ల కింద విందు భోజనాలు ఏర్పాటు చేసుకుని కుటుంబ సభ్యులు, బంధువులతో ఆనందంగా గడిపారు.

నిరుపయోగంగా నీటితొట్టె

నవాబుపేట: పశువులకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నీటితొట్లు నిరుపయోగంగా మారుతున్నాయి. మండల కేంద్రంలో అలా ఓ తొట్టిని ఉపయోగించకుండా వదిలివేశారు. నీటితో నింపడం లేదు. దీంతో దానికి సమీపంలో ఉన్న ప్రజలు దానిలో కట్టెలు వేయడం వంటివి చేస్తున్నారు. ఈ క్రమంలో బాధ్యులు చర్యలు తీసుకుని వాటిని ఉపయోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

